
శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహారాజ్ కీ జై!!
సద్గురు సాయినాథుని శరద్బాబూజీ కీ జై!!

# గురుకృప

గురోపినతి మీ కరీ హృదయ మందిరీ యా బసా! సమస్త జగహే గురు స్వరూప చీ ఠసో మానసా!
కరో సతత సత్కృతీ మతిహిదే జగత్పావనా!

జన్మదిన



సంచిక

ఓ సద్గురూ! నాహృదయ మందిరంలో నిలచి ఈ సమస్త జగత్తంతా సద్గురు స్వరూపంగా భాసించేటట్లు చెయ్యి! ఎప్పుడూ జగత్కళ్యాణ కార్యాలు చెయ్యాలనే సద్బుద్ధిని ప్రసాదించు!

సంపుటి:3 సంచిక:9 త్రైమాసిక పత్రిక డిసెంబర్-1999

## సాయివంటి దైవంబు లేడోయి లేడోయి !

ప్రజలందరి నోట సాయి నామం
పలకాలి! సర్వత్రా సాయి
రూపం రంజిల్లాలి!
ముజ్జగాలు సాయి మహిమతో
ముప్పిరి గొనాలి! సాయిపద
రవళులు మన హృదయ
కుహరంలోని నిశ్శబ్ద నిశీధిలో
ప్రతిధ్వనించాలి. ప్రణవనాద
వీచికల్లా సాయి జ్ఞాన సౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి! ఆ
సుజ్ఞాన సౌరభాల
ఆస్వాదనలో మన మనసులు
మత్తెక్కాలి! సాయి
ప్రేమామృతధారలు అంతటా
నిరంతరం వర్షించాలి!



సద్గురు
శ్రీ సాయినాథుని శరద్బాబూజీ

ఆ ప్రేమామృత ధారలలో
తడుస్తూ, ఆ జ్ఞాన సౌరభాల
మత్తులో ఆనందంగా నర్తిస్తూ
'సాయి వంటి దైవంబు లేడోయి!
లేడోయి!!' అని అందరూ ఏక
కంఠంతో గానం చేయాలి!
అదే నా ఆశ, ఆశయం,
ఆకాంక్ష! అదొక మధుర
స్వప్నం. ఆ స్వప్న సాఫల్యం
కోసం శ్రీ సాయినాథుని
అనన్యప్రేమతో ఆర్ద్రతతో
ప్రార్థించటమే మనం
చేయగలిగింది,
చెయ్యవలసింది.

---

## *ఈ సంచికలో*


| | | |
|---|---|---|
| 1. | సాయివంటి దైవంబులేడోయి!లేడోయి | |
| 2. | ఉన్నమాట - అనుకున్నమాట - | గురు బంధువులు |
| 3. | మనసును నియమించే మర్మాలు | డా॥ సాయినాథుని శరద్బాబూజీ (సాయిపథం నుండి) |
| 4. | మా కోరికలు తీర్చింది గురువుగారే | శ్రీమతి నాగేంద్రమ్మ |
| 5. | భయం లేకుండా - భజన చేస్తున్నాను | ఎం. వెంకటేశ్వర్లు |
| 6. | బాబా చూపించిన బాబూజీ | నంబూరి గీతశ్రీ అన్నపూర్ణ |
| 7. | ప్రథమ దర్శనంలోనే ప్రతిఫలాన్ని పొందాను | సి.హెచ్. మహేష్ |
| 8. | గురువచనం - అమోఘం | పి.సుమిత్ర |
| 9. | బాబాలా - బాబూజీ ఆదరిస్తున్నారు | ఆవుల రామానుజమ్మ |
| 10. | సరిదిద్దు - సంస్కరించు - సరిదారి చూపు - శరద్బాబు(ఆ చేయి ఎంత హాయి భాగము 7) | డా॥ యస్. సాయివరప్రసాదరావు. |

## ఉన్నమాట - అనుకున్నమాట

మీ చేతిలో ఉన్న ఈ "గురుకృప" తృతీయ సంచిక - అని తెలియజేయటానికి ఆనందిస్తున్నాం.

ప్రతి పనికి భగవత్ప్రేరణతో బాటు ఒక నిర్దిష్టమైన ఆశయం, నిర్ణీత సమయం, పరిస్థితుల సానుకూలత వీటన్నికీ తోడు తోటి వారి సహకారం అవసరం. అప్పుడు చేయదలచుకున్న పనికి, చేసిన పనికి సార్థకత చేకూరుతుంది. ఇప్పటి వరకు గురుబంధువులెందరో చూపిస్తున్న ఆదరాభిమానాలతో ఈ "పత్రిక పాప" నడకలు నేర్చిన నెమలిలాగా అందంగా పురివిప్పి నాట్యం చేస్తూ పదుగురి హృదయాలను పలకరిస్తూ పులకరింపజేస్తోంది. క్రొత్త సంచికలు చదివినవారు జిజ్ఞాసతో "పాత పత్రికలు కావాలి" అని కోరటమే ఈ పత్రిక విజయానికి తొలి మెట్టు.

ప్రస్తుతం ముద్రింపబడుతున్న గురుకృప 1000 కాపీలు చాలటం లేదు. దీనికి కారణం దిన దిన ప్రవర్ధమానమౌతున్న సాయి భక్తులు - గురుబంధువులు. సాయి భక్తులు గురుబంధువులుగా పరిణతి చెంది గురూజీ సరళరచనలైన "సాయిపథం, సాయిభక్తి సాధనా రహస్యం" గ్రంథాల ద్వారా సాయితత్త్వాన్ని, సాయి బోధనలను, సాయి ఆచరణ మార్గాన్ని తెలుసుకుని, వారి దర్శనార్థమై శిరిడీ చేరి బాబా దర్శనం, గురూజీ ఆశీస్సులు పొందుతున్నారు. ఇలా వస్తున్న అసంఖ్యాక గురుబంధువులెందరో "గురుకృప" చదవటానికి, గురూజీ మహిమల్ని తెలుసుకోవటానికి ఉత్సుకత చూపుతున్నారు. ఇది "గురుకృప" నిర్వాహకులకు ఎంతో ఉత్సాహాన్ని, ప్రోత్సాహాన్ని కలిగిస్తోంది.

గత సంవత్సర కాలంలో గురూజీ ఆశీస్సులతో సాయిబాబా సత్సంగ కేద్రాలు, శిరిడీ వారి నిర్వహణలో కొత్తగా రూపుదిద్దుకొని గుంటూరు, నెల్లూరు, ఒంగోలు, కొవ్వూరు, బోధన్, విశాఖపట్నం, శింగనమల మొదలైన పలు ప్రాంతాలలో నెలకొల్పబడి, గురూజీ బాటలో, సాయిపథంలో పయనిస్తున్నాయి. ఆయా కేంద్రాలలోని గురుబంధువులు సరైన సాయిబాటలో పయనిస్తూ పలువురికి ఆ మార్గాన్ని చూపుతున్నారు. సాయినామ సంకీర్తనలు, సాయి ఏకాహములు, సాయి సప్తాహములు నిర్వహిస్తూ అఖండసాయినామ సంకీర్తనల హోరులో తాము పులకిస్తూ, ఎందరినో పులకింపజేస్తూ, "సాయివంటి దైవంబు లేడోయి లేడోయి" అని అనుభవపూర్వకంగా ఏకకంఠంతో గానం చేస్తున్నారు. గురూజీ ఆశ ఆశయం - ఆకాంక్షలకు ప్రతిరూపాలుగా ఈ సత్సంగ కేంద్రాలు విలసిల్లుతున్నాయి.

ఈ సహస్రాబ్దికి వీడ్కోలు పల్కుతూ క్రొత్త సహస్రాబ్దిలోకి అడుగిడుతున్న మనందరం 2000 సంవత్సరానికి స్వాగతం పలుకుతూ సాయి తత్త్వాన్ని మరింతగా ఆకళింపు చేసుకొని, గురూజీ మహిమల నుండి, మనం పొందిన అనుభవాలను, అనుభూతులను రచనలుగా మలచి "గురుకృప" పత్రిక ద్వారా పదిమందికీ పంచుతూ, చేయి చేయి కలిపి భక్తి తత్త్వంతో, కృతజ్ఞతా పూర్వకంగా, ఆదర్శవంతంగా పయనిద్దాం.

గురుబంధువులు.

# మనసును నియమించే మర్మాలు!

సాయిపథం నుండి
మే - 1988

"నన్ను కేవలం ఆనంద స్వరూపంగా ధ్యానించు! అది చేతకాకుంటే, నిత్యం నీవు చూచే ఈ నా రూపాన్ని ధ్యానించు!" అన్నారు శ్రీ సాయిబాబా. బాబా మొదట ఆదేశించిన నిరాకార ధ్యానమార్గానికి సంబంధించి కొన్ని సుళువులను, పద్ధతులను క్లుప్తంగా తెలుసుకొందాం!

1. ఎటువంటి శ్రమ, బిగింపు అవసరం లేకుండానే హాయిగా ఎక్కువసేపు కూర్చొనగలిగిన ఆసనంలో కూర్చొని మనసారా బాబాను స్మరించు, అసలైన ఆయన, స్వరూపాన్ని సాక్షాత్కరింప చేయమని మనస్సులో ప్రార్థించాలి.

2. కళ్ళు మూసుకొని, మనస్సులో ఏ రూపాన్ని భావించకుండా, నిరామయం చేసుకొని, బాబా నామాన్ని మనస్సులోనే జపించటం ప్రారంభించాలి.

3. జపం ప్రారంభించిన వెంటనే ఏవేవో ఆలోచనలు కూడా వాటి తోటే మొదలవుతాయి. సాధన ప్రారంభంలో అలా ఆలోచనలు వస్తున్నట్లు కూడా మనకు గుర్తింపుకు రాదు. ఆ ఆలోచనలతో ఎంత తాదాత్మ్యం చెందుతామంటే ధ్యానానికి కూర్చున్నంతసేపు ధ్యానమో, జపమో ఏకాగ్రతగా చేస్తున్నామని భ్రమపడతాం. కానీ కొంతకాలం శ్రద్ధతో సాధన కొనసాగించి, మనస్సు అంతర్ముఖం కావటం మొదలైన తరువాత, ధ్యానం సరిగ్గా కుదరటం లేదని ఆలోచనలు తెరలు తెరలుగా ఎంత ఆపినా ఆగకుండా వస్తూనే వున్నాయని గుర్తించి, ఆందోళన చెందుతాం. కానీ అది శుభసూచకం! ఎందుకంటే మొదట మన 'శత్రువు' వునికిని మనం గుర్తించగలిగాం కదా?

4. నిరామయంగా వున్న మనస్సులో ఆలోచన పుట్టీపుట్టగానే గుర్తించి, వెంటనే త్రుంచెయ్యాలి. త్రుంచేస్తుండే కొద్దీ మరో ఆలోచన వెనువెంటనే పుట్టుకొస్తుంది. రావణాసురిని తలల మాదిరి ఈ ఆలోచనా ప్రవాహంలోని చిత్రమేమంటే, ఆలోచన పుట్టిన వెంటనే అది మన గుర్తింపులోకి రాదు. కొంతసేపు గడిచాక "అరె! ఆలోచన!!" అని గుర్తిస్తాం. గుర్తించిన వెంటనే ఆ ఆలోచన ఆగిపోతుంది.కానీ మనకు తెలియకుండానే మరో ఆలోచన మొదలైయుంటుంది! ఇలా ఆలోచనలను గుర్తించడం, ఆ 'గుర్తింపు' అనే ఖడ్గంతో ఆలోచనలను ఖండించడం అనేవి తిరిగి తిరిగి విసుగు లేకుండా చేస్తూ ఉండాలి. ఆలోచన మొదలయ్యీ అవకముందే గుర్తించగలిగితే మనం సాధనలో మొదటి మెట్టుకు దగ్గరగా వున్నామన్న మాట.

5. అలా ఆలోచనలు త్రుంచేయ్యడములో మనం గుర్తుంచుకోవలసిన విషయం - ఏ ఆలోచనైనా 'ఆలోచనే' గాని, వాటిలో 'మంచి' 'చెడు' తారతమ్యం మనకు అవసరం లేదు. మనం 'పాపమనీ, దోషమనీ' అనుకొనే, ఆలోచనలు వచ్చినప్పుడు ఆ 'పాప చింతన' గురించి చింతతో చింతించడం వంటి పొరపాట్లు చెయ్యకూడదు. మన ఆలోచనలలోని సారాంశం పట్ల, వాటి మంచి చెడ్డల పట్ల నిర్లిప్తత వహించగలిగే వివేకం, దృక్పథం రావాలి. అప్పుడే ఆలోచనలకాధారమైన భావాలను మొగ్గలోనే చెరిపేసి, అవి మామూలుగా 'రూపుదిద్దుకో' నివ్వకుండా జాగ్రత్తపడగలం. మన లక్ష్యం ఆలోచనలను అధిగమించడమే. అందుకే భగవాన్ రమణ మహర్షి అంటారు. "ఆలోచించడమే పాపం!" ("To think is sin") అని.

6. ఆలోచనా ప్రవాహాన్ని అడ్డుకట్టవేయాలని ప్రయత్నించి, ప్రయత్నించి ఒక దశలో అలసిపోతాము. అప్పుడు తెరలుగ క్రమ్ముకొని వస్తున్న ఆలోచనలతో తాదాత్మ్యం చెందకుండా, ఆ ఆలోచనా ప్రవాహాన్నుండి విడి వడి,

వాటిని 'సాక్షి' గా చూస్తుండడానికి యత్నించాలి. దీన్నే - 'మంచి ఈతగాడు సముద్రంలో లోతుకు పోవాలనుకొన్నప్పుడు మొదటవుండే అలల తాకిడి నుండి తప్పుకోవడానికి ఎలాగైతే నీటిలో మునిగి అల తన తలపై నుండి దాటి పోగానే ముందుకు సాగుతాడో, అలాగు' - అని వర్ణిస్తారు భగవాన్ రమణ మహర్షి. అలల తాకిడి నీటి ఉపరితలంపైనే కానీ, లోతుకుపోయే కొద్దీ ఎలాగైతే వుండదో అలాగే ధ్యానంలో లోతుకుపొయ్యే కొద్దీ ఆలోచనల తాకిడి తగ్గుతుంది.

7. ఇలా చెయ్యగా, చెయ్యగా ఆలోచనలు ఒక దశలో ఆగిపోతాయి. అప్పుడు జపమూ ఆగుతుంది. అంటే జపం అజడమవుతుందన్న మాట. సాధనకు కావాల్సింది - ఓటమితో రాజీపడని పట్టుదల, నిస్పృహ పిసుగు లేని ఓరిమి. అవే బాబా కోరిన - నిష్ఠ, సబూరిలు.

అలా మనస్సు నీ ఆలోచన లేక నిరామయమైన స్థితిలో ఎంతసేపు వుండగలిగితే అంతసేపు వుండగలగాలి. సాధారణంగా, ముందు చెప్పిన పద్ధతులలో యత్నించి, మనసు ఆ స్థితిలో నిలవగానే, ధ్యానం నుండి లేవడం జరుగుతూ వుంటుంది. కానీ ఆలోచనలు అణిగిన క్షణం నుండే నిజమైన ధ్యానం ప్రారంభమవుతుంది. మనస్సు ధ్యానానికి కూర్చున్న వెంటనే అంతర్ముఖమై, ధ్యానస్థం కావాలంటే నిత్య జీవితంలో మన వ్యవహారము, ఆలోచనా సరళి, ఆహార విహారాలు సరిగ్గా వుండాలి. అవి ఎలా వుండాలో అన్న అంశం, యీ సాధనకు సంబంధించిన మరికొన్ని అంశాలు ముందు ముందు తెలుసుకొందాం.

## "మా కోరికలు తీర్చింది గురువుగారే"

గురుదేవులు సాయినాథుని శరద్బాబుగారు తెనాలికి వచ్చినప్పుడు "బాబా" మందిరానికి వచ్చారు. వారిని గురించి గాని, వారి మహిమను గురించిగాని నాకేమి తెలియదు. మందిరానికి వచ్చారు గదా! ఎవరో గొప్పవారై ఉంటారని అనుకొని వారి పాదాలకు నమస్కరించుకొని, మాకు చాలా రోజులనుంచి మాకు ఇవ్వవలసినవారు మా దగ్గర తీసుకొన్న పైకాన్ని ఇవ్వటం లేదనినాను. శరద్బాబుగారు మీకు పైకం తొందరలో వస్తుందనినారు. అలాగే మాకు ఇవ్వవలసిన 79 వేల రూపాయలు పూర్తి మొత్తం వచ్చేసినవి. అప్పటి నుండి వార్ని మాకు గురువుగారి లాగా ఆరాధించుకొంటున్నాము.

మా కోడలుకు వేపిల్ల సమయములో చాలా నీరసంగా వుంది. బాధ పడుచున్నది. అప్పుడు వాళ్లు గ్వాలియర్ లో ఉంటున్నారు. డాక్టరుకు చూపించాలి వాస్తవంగా, కాని శరద్బాబూజీగారి పై భారమేసి గ్వాలియర్ నుంచి తెనాలికి తీసికొచ్చాము. ఇక్కడకు వచ్చిన తరువాత ఆమెకు ఏమీ కాలేదు. మునుపటి కంటే ఆరోగ్యం ఇంకా బాగుంది. పాప పుట్టింది. "సాయి పవనజాహ్నవి" అని పేరు పెట్టాము.

మా వారికి పెద్ద బండ కాలిమీద పడి చాలా ప్రమాదం జరిగింది. కుట్లు వేసినా కలువలేదు. కాలు తెగింది. మళ్ళీ గురువుగార్కి నమస్కరించుకొనినాము. మొదట కష్టమని డాక్టరుగారు చెప్పినారు. గురువుగార్కి విన్నపించుకొనిన తరువాత అతి త్వరగా తగ్గిపోయి ప్రమాదం తప్పింది. ఇలా వారు మా కోర్కెలను తీర్చినారు.

తెనాలి
25-6-96

శ్రీమతి నాగేంద్రమ్మ.

## భయం లేకుండా - భజన చేస్తున్నాను

1. 1993లో విజయదశమికి తెనాలి నుండి షిర్డీకి బయలుదేరినాము. విజయవాడ దాటిన తరువాత కంచకచర్ల వద్ద మా బస్సు రోడ్డు మధ్యలో తల్లక్రిందులుగా పడినది. శరత్ బాబు గారి కృప వల్ల మా బస్సులో వారికి ఎవరికి ఏమి జరగలేదు. ఆయన దయ వల్ల షిరిడీ చేరిన తరువాత శరత్ బాబు గారు మమ్మల్ని ఆశీర్వదించిగారు.

2. నాకు కాళ్ళు విపరీతంగా పగులుతాయి. నేను సద్గురువులైన శరత్ బాబుకి ఈ విషయం చెప్పినాను. నా కాళ్ళు ఆయన చూచినారు. ఆయన చూచిన తరువాత సరే అని నా కాళ్ళకు విబూధి వ్రాసినాను. ఆ తరువాత అనగా అప్పటి నుండి పగలటం లేదు. వారి దయవల్ల అప్పటి నుండి నా కాళ్ళు బాగున్నాయి.

3. శరత్ బాబుగారు శ్రీశైలం వచ్చినప్పుడు గురువుగారికి పాట పాడేటప్పుడు భయంగా ఉంటుందని చెప్పినాను. గురువుగారు నా గుండె మీద విభూధి వ్రాసినారు. అప్పటి నుండి గురువుగారి దయవల్ల భయం లేకుండా పాట, భజన చేయగల్గుతున్నాను.

4. గురువుగారు తిరుమల వచ్చినపుడు, గురువుగారు గదిలో ఉన్నారు. ఆ గదిలో సత్సంగం జరుగుతున్నది. ఆ గది అంత నిండిపోయి ఉన్నది. నేను బయట ఉన్నాను. గురువుగారి గదిలోకి వెళ్లాలని అభిలాష ఉన్నది. నేను అనుకున్న ఐదు నిముషములకు లోపలినుండి ఇద్దరు బయటకు వచ్చినారు. నేను అప్పుడు లోపలికి వెళ్లి గురువుగారిని చూచుకుంటూ సత్సంగం వింటూ కాలం గడిపినాను.



తెనాలి
25-2-96 ఎం. వెంకటేశ్వర్లు.

## "బాబా చూపించిన బాబూజీ"

బాబా ఋణానుబంధం వల్లనే అన్నీ జరుగుతాయి అంటారు. ఈ వాక్యం నా పట్ల ఋజువయ్యింది. నేను పెళ్ళి కాకముందు కంప్యూటర్ క్లాసులకి వెళ్ళేదాన్ని. అక్కడ సందు చివర బాబా గుడికి మా ఫ్రెండ్స్‌తో కలిసి గురువారాలు వెళ్ళేదాన్ని. అప్పుడు బాబా గురించి నాకేమి తెలియదు. ఆ రోజుల్లోనే నాకు పెళ్ళి కుదిరింది. వాళ్ళు బాబా భక్తులని మాకు తరువాత తెలిసింది. నేను వెంటనే, "బాబా నన్ను వారి దగ్గరకు రప్పించుకుంటున్నారు" అనుకున్నాను.

గురూజీ ఆశీర్వచనంతో మా వివాహం జరగటం వారు రావటం ఒక అపూర్వ సంఘటన. గురూజీని నేను ప్రథమంగా ఆ రోజే చుశాను. అప్పట్నుంచి నేను బాబాను, గురువుగారిని మరచిపోలేదు.

తరువాతే, నేను మా వారు మొదటిసారిగా షిరిడీ వెళ్ళినప్పుడు, గురువుగారు నన్ను వారి కుటుంబ సభ్యురాలిగా ఎంతో ఆప్యాయంగా మాట్లాడారు.

ఎంతో యాధృచ్ఛికంగా నేను బాబాకు చేసిన నమస్కారానికి నన్ను బాబా మన గురువుగారి పాదాల వద్దకు చేర్చారు.


ఆగష్టు, 94లో గురువుగారు రైలులో గుంటూరు మీదుగా వెళ్తున్నారు అని మాకు తెలిసింది. వెంటనే అందరం ఆ రోజు వారిని గుంటూరు రైల్వే స్టేషన్ లో దర్శనం చేసుకొన్నాము. ఆ తరువాత నేను గర్భవతినని తెలిసింది. అప్పట్నుంచి మళ్ళీ గురువుగారిని దర్శించుకోవాలి అని ఎంతో ఆశ పడ్డాను, కాని వారు నన్ను దూరంగానే ఉంచి, తమ మహిమను చూపారు.

అది ఏమిటంటే, "బాబా, నేను స్కానింగ్ తీయించుకుని పాపో, బాబో తెలుసుకోను. మీరు మాత్రం నాకు బాబును ఇవ్వాలి" అని కోరుకున్నాను. డాక్టర్‌గారు నాకు రెండు సార్లు స్కానింగ్ తీయించారు, కాని నేను ఏ బిడ్డ అన్న సంగతి వాళ్ళని అడగలేదు. నా విశ్వాసాన్ని గురువుగారు మన్నించి నాకు మగబిడ్డను ప్రసాదించారు.

గురువుగారు "బాబాను నమ్ముకోండి. ఏది ఎప్పుడు ఎలా జరగాలో బాబాయే చూస్తారు" అంటారు.

నేను గర్భవతిగా ఉన్నప్పుడు, ఒకరు నన్ను చూచి, డెలివరీ కష్టం అవుతుంది అని చెప్పారు. అప్పట్నుంచి నేను బాబాను, గురువుగారిని తలచుకుంటూనే ఉండేదాన్ని.

ఏప్రిల్, 6, 95 న డెలివరీ కోసం నన్ను హాస్పిటల్‌లో జాయిన్ అవ్వమన్నారు. కాని, నాకు నొప్పులు రాలేదు. మర్నాడు సాయంత్రం నన్ను స్కానింగ్ తీయించుకొని రమ్మని డాక్టర్‌గారు పంపి, ఆవిడ సత్సంగానికి వెళ్ళారు. స్కానింగ్ తీశాక, వాళ్ళు, "మేము డాక్టర్‌గారితో ఫోన్ లో మాట్లాడతాము మీరు హాస్పిటల్ కి వెళ్ళండి" అన్నారు. మేము తిరిగి హాస్పిటల్‌కి వెళ్ళేసరికి తెలిసిందేమంటే, డాక్టర్‌గారు ఆ సందులోకి వెళ్ళికూడా సత్సంగం జరిగే ఇల్లు తెలుసుకోలేక వచ్చేశారు. వారు వచ్చిన వెంటనే స్కానింగ్ సెంటర్ నుండి నాకు వెంటనే ఆపరేషన్ చెయ్యాలి లేకపోతే ప్రమాదం అని ఫోన్ వచ్చింది. వెంటనే మత్తు మందు ఇచ్చే డాక్టర్ కోసం వెళితే కాంపౌండర్ కి ఆయనే ఎదురు వచ్చారు. అట్నుంచి వారు వెంటనే హాస్పిటల్‌కి వచ్చారు. ఇదంతా కొద్ది నిముషాల్లో జరిగిపోయింది.



నేను గురువుగారు ఇచ్చిన ఊదీ తీసుకొని ఆపరేషన్ థియేటర్ లోకి వెళ్ళాను. ఎటువంటి కాంప్లికేషన్స్ లేకుండా ఆపరేషన్ సక్సెస్‌ఫుల్‌గా జరిగి మగబిడ్డ కలిగాడు.

అందరూ నన్ను చాలా లక్కీ అన్నారు. కొంచెం ఆలశ్యం అయినా, చాలా కష్టం అయ్యేదని డాక్టర్ అన్నారు. బాబా ఎవర్ని ఎలా రప్పించాలో, ఏది ఎలా చెయ్యాలో, అనుకొని విధంగా ఏర్పాటుచేసి నన్ను, నా బిడ్డని రక్షించారు.

మాకు బాబు పుట్టాడు అన్న విషయం గురువుగారికి బుద్ధగయకు వెళ్తుండగా తెలిసింది. మేము బాబుకు పేరు పెట్టమని వారిని ప్రార్థించినప్పుడు, వారు బాబుకు 'గౌతమ్' అని నామకరణం చేశారు.

మా బాబుకు ఫిబ్రవరి, 96 చివరిలో మోషన్స్ అవుతున్నాయి. అప్పుడు గురువుగారు తిరుపతిలో ఉన్నారు. నేను బాబుకు బాగుండలేదని వారి దర్శనానికి వెళ్ళలేకపోయాను. కాని, మా వారితో బాబుకు మోషన్స్ అని తెలియజేస్తూ, ఒక లెటర్ వ్రాసి గురువు గారికి పంపాను. వారు డాక్టర్ నరేంద్ర గారి వద్ద మందు వాడమని చెప్పారు. వారికి నెల్లూరు ఫోన్‌చేసి, వారు చెప్పిన మందులే వాడాము. కాని ఏమీ గుణం కనిపించలేదు. బాబు పుట్టినరోజున పార్టీ చెయ్యాలి అనుకున్నాము. కాని బాబుకు నయం కాలేదని గురువుగారికి ఒక లెటర్ వ్రాసి, నేను ఆ రోజు గురువారము కావటంతో, గురువుగారి ఫోటో ముందు కన్నీళ్ళతో, "వచ్చే బుధవారమే గౌతమ్ పుట్టినరోజు మీరు ఎట్లాగయినా బాబుకు ఆ రోజుకు ఆరోగ్యం చేకూర్చి ఫంక్షన్ జరిగేటట్లు చెయ్యండి" అని ప్రార్థించాను.

ఆ మర్నాడే నరేంద్ర గారితో మా వారు ఫోన్‌లో మాట్లాడితే, చంటి బాబుకు ఫోన్‌లో మందులు చెప్పటం కష్టం. మీరు మీ దగ్గర్లో ఉన్న డాక్టర్ కి చూపించండి అన్నారు. వెంటనే గుంటూరులో చూపిస్తే, ఒక్క ఇంజక్షన్ కి తగ్గిపోయి, రెండు రోజుల్లో బాబు ఊహించని రీతిలో చాలా ఆనందంగా కోలుకున్నాడు. గురువుగారితో చెప్పి బర్త్ డే పార్టీ చాలా గ్రాండ్ గా చేశాము.


నా జీవితంలోని ప్రతి ముఖ్యమైన సంఘటన గురువుగారి ఆశీస్సులతో శుభప్రదంగా జరుగుతున్నవి.

విజయవాడ

నంబూరి గీతశ్రీ అన్నపూర్ణ.

## "ప్రథమ దర్శనంలోనే ప్రతిఫలాన్ని పొందాను"

నాకు మొదటిసారిగా గురు దర్శనం చేసుకొనేటప్పుడు ఆయన ఎవరో యేమిటో కూడా తెలియదు. ఆయన శ్రీశైలం రాగానే సాయినథుని సత్సంగ కేంద్రంలోని గురుబంధువులందరూ ఆయన దర్శనంకోసం బస్సు రిజర్వేషన్ చేయించుకున్నారు. అందులో నా ఫ్రెండ్ సునీల్, నీవు కూడా రమ్మంటే నాకు రావాలని అనిపించలేను, వస్తానులే అని చెప్పాను. అది నేను నమ్మకంతో చెప్పింది కాదు. అందరూ బయలుదేరి వెళ్లే ముందు రోజు నేనుకూడా వస్తానన్నాను. అప్పటికి బస్సు ఫుల్ అయినది. నాకు గురుగారిని చూడాలని ఉంటే నాకు గురువుగారు టికెట్ యిప్పిస్తారని, నమ్మకంతో గురువుగారిని ప్రార్థించాను. నా అదృష్టం కొద్దీ ఒక గురుబంధువు టికెట్ నాకు లభించింది. అందరితో కలసి గురువుగారిని శ్రీశైలంలో దర్శనం చేసుకున్నాను.



మా కుటుంబం చల్లగా చూడమని కోరుకున్నాను. నాకు నుదుట విభూధి పెట్టి ప్రసాదము యిచ్చి దీవించినారు. అప్పటినుండి నేను ప్రతివారం సత్సంగానికి వెళ్తున్నాను. ఆయన దర్శనం లభించిన రెండు నెలలకే మా అన్నయ్యకు ఉద్యోగం లభించింది. అప్పుడు సత్సంగ మహిమ నాకు అర్థమయినది. గురువుగారి లీల వ్యక్తమయినది.

నేను మరల గురువుగారిని తిరుమలలో దర్శనం చేసుకున్నాను. ఆయన అనుగ్రహం వల్ల ఆరోజు గురువుగారు గురుబంధువులందరినీ శ్రీ వెంకటేశ్వర స్వామి దర్శనం చేసుకొని రమ్మనగా నేను నా ఫ్రెండ్ కిరణ్ వెళ్ళి దర్శనం చేసుకొన్నాము. అప్పటికి మధ్యాహ్నం 2 గం|| అయినది. గురువుగారి దర్శనం చేసుకొనిన తరువాత భోజనం చేద్దామని అనుకొన్నాను. కాని ఆకలితో దైవదర్శనం చేసుకొనటం బాబాకి ఎలా అయితే యిష్టము వుండదో అలానే గురువు గార్కి కూడా యిష్టం ఉండదని ఈ మహిమ ద్వారా చెప్పినారు.

మధ్యాహ్నం అందరూ సాయినామం చెప్తుండగా మధ్యలో నన్ను శ్రీధర్ అనే గురుబంధువు పిలిచి, "నాకు పరీక్షలు గురువుగారు చేతితో తీసుకున్న పెన్నుతో వ్రాయాలి అని ఉన్నది. ఒక మంచి పెన్ను తెచ్చిపెట్టమని అడిగినాడు. నేను ఒక్కడినే వెళ్ళకుండా నా ఫ్రెండ్ కిరణ్ ని కూడా తీసుకొని వెళ్ళినాను. ఇద్దరం 1 గంట పెన్ను కోసం తిరిగినా ఎక్కడా మంచి పెన్ను దొరకలేదు. ఇక లాభం లేదు, గురువుగారు ఏమైనా తిని రమ్మని పంపించినారు. ఏమైనా తింటే కాని పెన్ను దొరకదని గ్రహించి టిఫిన్ చేసినాము. తరువాత వెళ్ళిన మొదటి కొట్టులోనే పెన్ను దొరికినది. అది కూడా మా కోసమే ఆ షాపులో ఒక్కటే వున్నది. ఆ రోజు గురువుగారి దర్శనం రాత్రి 11 గం.లు అయినది. ఆ దర్శన భాగ్యం మరువరానిది. ఆకలి తీర్చారు. ఆయన లీలలు వర్ణించలేనటువంటివి. ఆయన గురించి ఎంత తెలుసుకున్నా తక్కువే.

మాకు గురువుగారి గురించి తెలియచెప్పి ఆయన దర్శన భాగ్యం లభింపచేసిన గురుబంధువులకు సర్వదా కృతజ్ఞుణ్ణి.

తెనాలి
30-6-96

సి.హెచ్. మహేష్

## గురువచనం - అమోఘం

నేను డిసెంబర్ 18వ తేదీ, 1994న గురువుగారి దర్శనానికి వెళ్ళాను. అప్పుడు నా ఆరోగ్యం గురించి గురువుతో చెప్పాను. గురువుగారు బాబా సచ్చరిత్ర చదువమ్మా అన్నారు! కాని నాకు బాబా అంటే నమ్మకం లేదు. అప్పటికి ఒకసారి సచ్చరిత్ర పారాయణం చేయటం జరిగింది. సచ్చరిత్రలో ఉన్న పదాలన్నీ కష్టంగా ఉండేవి. నాకు చదవాలంటే విసుగ్గా ఉండేది. గురువుగారిని మళ్ళీ 2 సార్లు దర్శనం చేసుకోవటం జరిగింది. కాని సచ్చరిత్ర చదువలేదు. నాకు ఆరోగ్యం బాగలేక నెల రోజులు అయింది. ఒకసారి మా ఇంట్లో ఒక్కదాన్నే కుర్చీలో కూర్చున్నప్పుడు సరే, ఆయన చెప్పారు కదా, సచ్చరిత్ర చదువుదామని కూర్చున్నాను. నిజానికి అప్పట్లో నాకు గురువు గారంటే నమ్మకంలేదు. రోజు ఒక పేజీ చదివే కొద్దీ నా ఆరోగ్యంలో మార్పు వచ్చింది. 3వ సారి గురువుగారి దర్శనానికి వెళ్ళినప్పుడు "ఏమ్మా సచ్చరిత్ర చదువుతున్నారా !" అని అడిగారు. నాకు చాలా ఆశ్చర్యం వేసింది. ఎందుకంటే సచ్చరిత్ర చదువుతున్నట్లు గురువుగారితో చెప్పలేదు. అంతకముందు 2 సార్లు దర్శనం చేసుకున్నా గురువుగారు నన్ను అడగలేదు. అప్పుడు కొంచెం ఆలోచించాను. గురువు మాట ముఖ్యం అని తెలుసుకున్నాను. అప్పటి నుండి నా ఆరోగ్యం చాలా బాగుంది.

ఒకసారి నాకు గురువుగారు కలలో కనిపించారు. కనిపించిన కొద్ది రోజులకు శిరిడీ వెళ్ళటం జరిగింది. శిరిడీలో గురువుగారి దర్శనానికి వెళ్ళినప్పుడు మేము సచ్చరిత్రలో కొన్ని సందేహాలు అడగటం జరిగింది. అప్పుడు సాక్షాత్కారము గురించి టాపిక్ వచ్చింది. అప్పుడు గురువుగారు నేను ఇక్కడ మీతో మాట్లాడటం కాదు. మీకు అక్కడ (విజయవాడలో) నేను కనిపిస్తే దాన్ని సాక్షాత్కరించటం అని అంటారు అని మాతో అనటం జరిగింది. మేము విజయవాడ ట్రాన్స్‌ఫర్ అయినట్లు గూడ గురువుగారితో చెప్పలేదు. గురువుగారు మీరు ఇప్పుడు 4 గంటలకు విజయవాడ బస్సుకు వెళుతున్నారు గదా అన్నారు.

విజయవాడ.
26-5-96

వి.సుమిత్ర

## బాబాలా - బాబూజీ ఆదరిస్తున్నారు

రామానుజమ్మను పేరుగల నేను 1994లో బాబా గారిని గూర్చి విని, మిక్కిలి భక్తి శ్రద్ధలతో ఉండేదానిని. మాకు తోటలు, ఆస్తి బాగానే ఉన్నాయి కాని ఫలము వచ్చే సమయానికి పంట చెడి పోవుతున్నది. పంటల వల్ల నష్టం వచ్చి, ఆర్థిక పరిస్థితి పూర్తిగా దిగజారిపోయినది. 1995 ఫిబ్రవరిలో నాకు శ్రీశైలంలో గురుదేవులు సాయినాథుని శరత్ బాబూజీ చిరునవ్వు నవ్వి స్వీట్ ఇచ్చి ఇక బాగుంటాయి అని అన్నారు. అప్పటినుండి మాకు పంటలు బాగా పండినాయి.

పూర్వం సాయిబాబా కూడా ఒకే ఒక నోటి మాటతో భక్తుల బాధలను తీర్చేవారు కదా! అదే విధంగా ఇప్పుడు సాయిబాబా భౌతికంగా లేకపోయినా ఆ రూపంలో ఆ మార్గంలో సాయినాథుని శరత్ బాబూజీ గారున్నారని

నాకు విశ్వాసమైనది. అందువల్ల నేను అప్పటినుండి బాబా పారాయణం చేస్తు సత్సంగమునకు వెళ్తున్నాను. ప్రతి చిన్న పనిలోను బాబా, ఆ రూపంలో ఉన్న శరత్ బాబూజీగారు చూస్తూ ఆదరిస్తున్నారు.

సంగం జాగర్లమూడి
7-7-96

ఆవుల రామానుజమ్మ

ఆ చేయి ఎంత హాయి భాగము - 7

## సరిదిద్దు - సంస్కరించు - సరిదారి చూపు - శరద్బాబు

ఈ పర్యాయం ప్రశ్న - జవాబు కాక, గురుబంధువులు అందరు ఆనందించాలని 88 సం|| జరిగిన సంఘటనను వివరిస్తున్నాను.

ఒక మామూలు భావన నుంచి మహిమాన్వితుడను తలంపు తలకెక్కిన తరువాత వారి వెంట వెన్నంటి తిరగాలని, వారితో ఎక్కువ కాలం గడపాలని, వారి మాటలు వినాలని, వారు చెప్పింది చప్పున చేయాలని ప్రారంభంలో నూత్న ఉత్సాహంతో సర్వసాధారణంగా అనిపిస్తుంది. అలాంటి సంఘటనే నా కంటి ముందు 31-12-88 / 1-1-89న జరిగింది.

శరద్బాబూజీగారితో మొదటిసారిగా పరిచయమైన వారందరు సామాన్యమైన వ్యక్తిగానే చాలామంది వారిని భావించారు, ఒకరో, ఇద్దరో తప్ప వారిని ఆ రోజుల్లో గురువుగా భావించలేకపోవటానికి కారణం సర్వసామాన్యమైన వారి విధానం, సాధారణమైన రీతిలో కన్పించేవారు, వాస్తవం చెప్పాలంటే నిజంగా మహాత్ములను సందర్శించిన వారెందరున్నారు. మహాత్ముల పోకడ ఎలా వుంటుందో తెలియకపోవటమే అందుకు కారణం కావచ్చు. దైవం మన ముందర తిరుగాడుచున్నప్పుడు, సాక్షాత్తు, సద్గురువు మనకందరికి సందర్శన ప్రాప్తిని కల్గింపచేసినను అర్థం చేసుకొనువారు చాలా అరుదుగా ఉంటారు. లౌకిక ప్రజ్ఞ కల్గిన మానవుని భావాలు ఎలా ఉంటాయో అలానే ఉన్నాయి. బాబుగారి వెంట తిరుగుతున్న వాళ్లకు.

చూచేవారిలోను వెంట తిరిగిన వారిలోను క్రమక్రమంగా పరిణితి కల్గింది. మొదట స్నేహితునిగా, ఆ తరువాత విద్యావంతునిగా, ఆ పిమ్మట, సంస్కారవంతునిగా, సంస్కర్తగా, మేధవిగా, మహామహోపాధ్యాయునిగా, తపస్సంపన్నునిగా,సాధకునిగా, సాయిసాధనా స్వరూపిగా, దైవమే ఈయన అనుభావనగా మారుతూ, మారుతూ వచ్చింది. చిట్టచివరకు సద్గురుని రూపమెలా ఉంటుంది? అని ప్రశ్నిస్తే ఠక్కున సాయినాథుని శరద్బాబూజీలా ఉంటుందని సమాధానమిచ్చేవారు. అంతగా వారిలో పరిణతి చెందటానికి కారణం గురువుగారి మహిమలు, లీలలు, బోధలు, అందుకు ఎంతగానో తోడ్పడినవి. అలాంటి సంఘటనను తెలియజేయు యదార్థ సంఘటనను వివరించుతాను గురువుగారి ఆశీస్సులతో.

గురువుగారు "సాయిపథం" పత్రికలో శ్రీ ఉపాసనీ బాబా జీవిత చరిత్రను సమగ్రవంతంగా పరిచయం చేసారు. అందులో "ఉపాసనీ" నా చర్మమును ఎవరో వలిచేస్తున్నట్లనిపించిందను మాట అప్పట్లో అర్థంకాలేదు. చర్మాన్ని వలచివేయుటమేమిటి? అనే అనుమానం? వలిచివేసేటప్పుడు ఎలా భరించగల్గుతాడను సందేహము వీడిపోలేదు. సద్గురువు సాయినాథుడు చర్మాన్ని వలిచివేయుటమేమిటి? అని అనుకున్నాను. కొన్ని సందేహాలకు సమాధానాలు వెంటనే లభించవు. కాలమే కొన్నింటికి సమాధానమిస్తుంది.

88 సం|| డిసెంబర్ మొదటి వారంలో అనుకుంటాను గురువుగారన్నారు. జనవరి 1వ తారీఖున మనమంతా ఒకచోట కలిసి ఆనాటి ముందు రేయి అంటే డిసెంబర్ 31వ తారీఖు రాత్రి 12 గం. "బాబా" పూజోత్సవాన్ని గురుబంధువులంతా సామూహికంగా నిర్వహిస్తే ఎలా ఉంటుంది, అన్నారు. చాలా బాగుంటుంది అని వారి సముదాయంలో ఉన్నవారందరనినారు. ఇది వేంకటగిరిలో తీసికొనిన నిర్ణయము. అయితే ఎక్కడ? అనే ప్రశ్న వెంటనే ఉదయించినది. వెంటనే కార్యక్రమానికి "శ్రీ"కారం చుట్టారు. ఒంగోలులో మన స్కూలు ఆవరణలోనే ఆరంభిద్దామనినారు గురువుగారు. 88 డిసెంబర్ 31వ తారీఖు రాత్రి 10 గం||లకంతా నాల్గు చెరుగులా ఉండే గురుబంధువులంతా రావాలనినారు. బహుశా అప్పుడు వేంకటగిరి, తెనాలి, గుంటూరు, హైద్రాబాదు ప్రాంతాలలోని గురుబంధువులకి సమాచారమిచ్చరు. వాస్తవానికి కొద్ది మందే వచ్చారు.

సరిగ్గా రాత్రి 11 గం|| సాయి సెంట్రల్ మిషన్ స్కూలులో 30 మంది కూర్చొనుటకు వీలున్న హాలుంది. చక్కని వాతావరణంలో పూజామందిరం ఏర్పాటు చేశారు. "బాబా" కొరకు ఏర్పాటు చేసిన ఆనాటి అలంకరణలో పూవుపూవున రేకు రేకున భక్తియనే సుగంధము, గుమగుమలు వెల్లడైనది. డా||శ్రీనివాసులరెడ్డి గారి గృహమునుంచి గురుబంధువులందరూ 11--00(రాత్రి) చేరినారు. గురువుగారే పూజాకార్యక్రమాన్ని నిర్వహించారు. అందుకనే నేమో మా అందరిలో భక్తిపారవశ్యము మోసులెత్తింది. ఆనాటి వారి పూజావిధానము ముద్దుకొల్పింది, ముచ్చటేసింది, మురిపెము కల్గించినది. దాస్యభక్తికి ఉదాహరణగా వారిని చెప్పవచ్చును. బాబా అంటే వారికెంతో ప్రేమ, పరిశుభ్రము చేయు సమయమున వారి శ్రద్ధ, నమస్కరించే సమయములో భక్తిభావశబలత, హారతిచ్చేసమయాన హృదయములోని వారి ఆనందము, బాబాకు సాష్టాంగపడి నమస్కరించే శరద్బాబూగారిని చూచి సాధకులు నేర్చవలసిన సాధనారహస్యాలు ఎన్నో ఉన్నాయని అన్పించింది. చక్కని స్వరముతో బాబా అష్టకము, మంత్రపుష్పమును గురువుగారు చదువుతుంటే కోనసీమలోని వేదసభలా ఉందినాకు. స్పష్టోచ్చారణ కల్గిన మంత్రోచ్చారణవింటే వేదముపైన గూడా వీరికి అధికారముందే! అని భావించాను. పాల్గొనిన కొద్దిమంది లోను ఏదోతెలియని భావసంతృప్తి, హృదయశాంతి తొంగిచూచినది. గురువుగారు బాబానామాన్ని చెప్తూ వారు భజన చేస్తూ మా అందరి చేత చేయించారు. గురుదేవులు మొదటి సాయిపూజా మహోత్సవాన్ని మరుపురాని, మరచిపోలేని మధురనుభూతిగా మిగిల్చినారు మా అందరికి.

వారు ముందు కూర్చొని గత సంవత్సరాలను అధ్యయనం చేస్తూ సింహావలోకనం చేస్తే ఈ జన్మ ఇంతవరకు సాధించినది ఆవగింజంతైనా ఉందా? ఏ ఏ వాసనలు నన్ను అంటిపెట్టుకొని ఉన్నాయో ఊహించలేకపోయాను. తెలవారలేదు. 2-30 దాటిందనుకుంటాను. మా అమ్మ చల్లని తల్లి, అమృత హస్తమున్న అనసూయమ్మగారు వచ్చిన మా అందరికోసం వేడి వేడిగా భోజనాలను తయారు చేస్తున్నారు. నాకు బాగ గుర్తుంది. నూనెతో గుత్తి వంకాయలను స్పెషల్ గా తయారు చేసారు. గుప్తాగారికి నూనెతో గుత్తివంకాయ అంటే ఎంతో ఇష్టము. నన్ను భోజనానికి రమ్మని మొదట S.V.L. గారు పిల్చారు. ఆ తరువాత గురువుగారు గూడా రమ్మనినారు. అమ్మగారు గూడా పిల్చారు.

అభిజాత్యపు వాసనలు, అణువణువున నిండిన నాకు, రక్తంలో కులాభిమానం, శుద్ధ వైదికాచారం తలకెక్కించుకొనిన నాకు, నేను అప్పుడేం పోగొట్టుకొనుచున్నానో తెలియదు. కోల్పోయిందేమిటో తెలియదు. అప్పటికి నేనింకా బాబా భక్తుడనేనా? బాబా మార్గములో నడుస్తున్నానా? అన్న ఆలోచనలు గురుదేవుల సాహచర్యములో కల్గినవి. గురుదేవుల సత్సంగము, వారి బోధనలు నన్ను క్రమక్రమంగా మార్చినవి. అయితే గురువుగారు ఏనాడు వేదాంత బోధనలుగాని, ప్రసంగాలుగాని చెప్పేవారు కారు. బాబాను గూర్చిన విషయలే చెప్పేవారు శ్రమనేది లేకుండా, అలుపన్నది రాకుండా గంటలు, గంటల తరబడి రాత్రి, పగలను వ్యత్యాసము లేకుండా చెప్పేవారు. బాబా మార్గము వైపుకు పయనించటానికి దోహదపడినది వారి మాటలే. ఏ ఏ పనులు మనము చేయటము వలన "బాబా" అనుగ్రహము బాబాకు మనమంటే ఇష్టమో! చెప్పేవారు బాబాను ఋణానుబంధముతో

బంధించటమెలాగో చెప్పేవారు. మొదట ఈ బోధనలు నచ్చినవి. బాబా తన సమీప భక్తులనందరిని ఎలా చూచారో చెప్పారు. కులానికిగాని, కులాభిమానానికిగాని ఆయనెన్నడూ ప్రాధాన్యమీయలేదు. అందుకనే గదా! వారి కుల, గోత్రాలుగాని, వంశాది విషయాలుగాని, తల్లి దండ్రులను గూర్చిగాని గోప్యంగా ఉంచినది. ఇందులో ఏ ఒక్కటి వెల్లడైనా బాబాను ఒక వర్గానికి చెందినవారు మాత్రమే ఆరాధించేవారు. "మహాత్ముడంటే" అన్ని వర్గాలవారు, అన్ని కులాలవారు, అన్ని మతల వారు పూజించేలా ఉండాలి. "చూడండి" "తాజుద్దీన్ బాబా" గొప్ప ఔలియా! ఎందరు హిందువులు, ఎంత మంది క్రైస్తవులు వారిని పూజించగల్గుతున్నారు. క్రీస్తును, ఎంత మంది ముస్లిం లు, ఎంత మంది హిందువులు ఆదరించగల్గుతున్నారు. "రామకృష్ణ పరమహంస" వంటి మహాత్ములను, ఎంత మంది క్రైస్తవులు, ఎంత మంది ముస్లిం లు పూజించగల్గుతున్నారు. అలా పూజించలేకపోవటానికి కారణం. వారంతా ఒక మతానికి చెందినవారుగా ప్రకటితమైనారు. అందుకనే "బాబా" తన కులమేమిటో, మతమేమిటో మొ|| విషయాలను వెలికిరానీయలేదు. "బంగారముందిగదా" దాని ద్వారా తయారైన ఆభరణాలు, బ్రాహ్మణులుగాని, బ్రాహ్మణేతరులుగాని, హిందువులుగాని, క్రైస్తవులుగాని, మహమ్మదీయులు గాని, సిక్కులుగాని, ఇంకా ఎవరైనాగాని ధరిస్తారు. హిందువులకని ఒక బంగారము, ముస్లిం లకని మరో బంగారమని ఎలా ఉండదో, "మహాత్ముడంటే" అందరికి మహాత్ముడుగానే పూజించాలి. అలాంటి వారిలో మన బాబా ఆద్యులని చెప్పాలనినారు. ఈ మాటలు నాలో కొంత పరివర్తన తెచ్చినవి. రక్తములో కల్సిన విషాన్ని డాక్టరు పేరు చేసి రక్తాన్ని శుద్ధి చేసి కలుషితాన్ని తీసివేసినట్లుగా ఉపకరించింది నా జాత్యాభిమానంపై దురభిమానంపై వారి బోధ.

మరో బోధ షిరిడీలోనే జరిగింది. గురుదేవుల ముందు దాదాపుగా 20 మంది ఉన్నారు. వారిలో ఈ అనామకునికి గూడా గురువుగారు అదృష్టాన్నిచ్చారు. చాలా విషయాలు చెప్పి సాధనా మార్గంగా కొందరు ముందుకు సాగాలని ప్రయత్నిస్తారు. మంచి ఆలోచనే కాని ఎలా ప్రయాణించాలో తెలియక తికమక పడుతుంటారు. పాత వాటిపై మమకారం పెంచుకొని ముందడుగు వేయటానికి వెనుకంజ వేస్తారు. ఎలాగంటే! మేడపై భాగమునకు చేరాలంటే మెట్లను కట్టుకుంటాము. ఒకటో మెట్టెక్కితేనే రెండో మెట్టు ఎక్కగలిగేది. రెండో మెట్టును దాటితేనే మూడో మెట్టునెక్కుతాము. అలా పై మేడకు చేరటానికి ఈ మెట్లను ఉపకరణాలుగా ఉపయోగించుకుంటున్నామన్న మాట. పై మెట్టెక్కాలంటే క్రింది మెట్టును వదిలి వేయవల్సిందే. నీ కింకా క్రింది మెట్టుపై మోజుంటే పైకి వెళ్ళాలన్నా వెళ్ళలేవు. అక్కడే వుంటావు. ఆధ్యాత్మికతలోను అంతే.

మరో ఉదాహరణ.


1వ తరగతి నుండి 5వ తరగతి వరకు ఎలిమెంటరీ స్కూల్ లో చదివినవాడు 6వ తరగతి నుడి 10వ తరగతివరకు హైస్కూల్లో చదువుతాడు. ఆ తరువాత జూనియర్ కళాశాల, ఆ తరువాత ఉన్నత కళాశాల ఆ విమ్మట విశ్వవిద్యాలయములో అధ్యయనము చేయగల్గుతాడు. అంటే 1వ తరగతి నుండి 5వ తరగతి వరకు నీవు విద్యాపరంగా సాగించిన 5సం|| సాధన నిన్ను హైస్కూల్ కు చేర్చినది. ఆ తరువాత 5 సం|| విద్యాపరమైన సాధన నిన్ను కళాశాల స్థాయి దాకా ఎలాగైతే తీసికొని వెళ్లినదో అలాగే నీ జీవితములోని నీ ఆధ్యాత్మిక సాధన గూడా నిన్ను ఒక తరగతి నుంచి ఒక తరగతికి మార్చిందన్న మాట. అంటే బాబా సన్నిధికి రాక ముందు మీరు మీ జీవితములో సాగించిన సంధ్యావందనాలు, దేవతా ఉపాసనలు, మొదలగు భక్తి మార్గముల ఫలమంతా ఫలించి నిన్ను "బాబా" అనే విశ్వవిద్యాలయంలోకి తీసికొని వెళ్లినవి. వాటి కర్తవ్యమంత వరకే నీ సాధనకు మరింత పరిపక్వత గలగాలంటే "బాబా" అనే ప్రొఫెసర్ ఏర్పాటు చేసిన కోర్సును చదవాల్సిందే. ఆ కోర్సును చదివిన తరువాతే గదా! నీ రిజల్సును చెప్పి "డిగ్రీ" ఇచ్చేది. 6వ తరగతిలో ఎక్కాల పుస్తకం చదువుతాము. B.A.లో చేరిన తరువాత గూడా ఎక్కాల పుస్తకాన్ని వెంట తెచ్చుకుంటామా! ఎక్కాలు చదవకుండానే ఇంత వాడినైనానని కృతజ్ఞతా సూచికంగా ఎక్కాల పుస్తకంతో పాటు చిన్నప్పటి పెద్ద బాలశిక్ష తెలుగు వాచకము, మొ||లగు పుస్తకాలను తెచ్చుకుంటే కాలేజీ కుర్రోళ్లు నిన్ను వింతగా చూస్తారు. వెఱ్ఱివానిగా భావిస్తారు.

నీకు మొదట ఉన్నత లక్ష్యం వైపుకు పయనించాలనే లక్ష్యం ఉండాలి. అప్పుడే దానికి సంబంధించిన గమ్యం వైపుకు పయనించగల్గుతావు. నీ లక్ష్యం "బాబా" అనుగ్రహమే అయితే సాయిపథ మార్గంలో పయనించాల్సిందే. నీ గతమందలి ఆధ్యాత్మిక అంశాలు నీ ఉన్నతికి వేసిన సోపానాలు అంతే.

బాబా కులానికి మతానికి ప్రాధన్యమిచ్చరా? మొదటి అధ్యాయంలో భోజనం చేయమని ఆహ్వానించగా నిరాదరణ చేసిన వారి గతి ఏమైందో మనకు బాబా చెప్పారు గదా! అందుకే గురుబంధువులు ఆహ్వానాన్ని అంగీకరించాలనినారు.

పై విషయాలు 'పిలిగ్రాం ఇన్' లో గురువుగారు అందర్ని ఉద్దేశించి చెప్పినా 'అవినాకే' అని నాకనిపించింది. ఆ తరువాత ఆగష్టులో గురువుగారు ఒంగోలుకు వచ్చారు. "నేను వెళ్ళాను" గురుదేవుల అనుమతికోసంగా వెళ్ళాను. ఈ ఊరిలో మా బంధువులున్నారు వెళ్లి పల్కరించి వస్తానన్నాను. అలాగే, కాని భోజనానికి ఇక్కడికే వస్తావుగాదూ! అన్నారు. ఆ నవ్వులో ఎన్ని వ్యంగ్యములు దాగి వున్నాయో నాకు తెలుసు. ఎక్కడనొక్కారో తెలుసు, ఎక్కడ పాశమేశారో తెలుసు. ఆ నవ్వు గురించి అందులోని అంతరార్థాన్ని గురించి మరో "50" పేజీలు రాసినా మిగిలే వుంటుంది.

తలవంచుకొని పాదాలు పట్టుకొని "చచ్చిన పామును ఇంకా చంపవద్దు" బుద్ధొచ్చింది. ఇక్కడే భోజనం చేస్తా! అన్నా వినయంగా. ఇది నన్ను సంస్కరించిన తీరు.



చర్మం వలచివేయుటమంటే మన ఆధ్యాత్మిక సాధనకు, బాబా అనుగ్రహమునకు దూరము చేసే పొరనే గురువుగారు చర్మమని వ్రాసి ఉంటారు. అలాంటి పొరలెన్ని ఉన్నాయో మనలో ఆ మహనీయుని శరణుజొచ్చిన మరుక్షణములోనే మన వాసనలను పొలుసులను అరగదీసి, అహంకారపు పొరలను, వారి అనురాగమను చేతితో లాగి వేస్తూ మనలనందరిని బాబా పథం వైపుకు పయనించేలా చేస్తున్నారు.

నమస్కారములతో

రేపల్లె

డా|| యస్. సాయివర ప్రసాదరావు.